క్లుప్తంగా


దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి


సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని ముప్పళ్లపాడు దళితవాడలో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సంజీవయ్య చిత్రపటానికి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొటికల బాలబాదుర్ల పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 లక్షల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. దళిత నాయకులు దమ్ము చెన్న కేశవులు, చిన్నబాదుర్ల, బాలయ్య, కొండయ్య, చెన్నకేశవయ్య, వెలుగొండయ్య, లింగయ్య, తిరుపతయ్య, బాలచంద్ర, చెన్నకృష్ణ, వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: మాజీ సీఎం దామోదరం సంజీవయ్య వర్ధంతిని కనిగిరిలో నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు సంజీవయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ధర్మ పోరాట సమితి రాష్ట్ర నాయకులు చదలవాడ బాలగురవయ్య, న్యాయవాది యరజాల బాలనారాయణ, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్, సీపీఐ మండల కార్యదర్శి జీపీ రామారావు, మాలల ఐక్యవేదిక నాయకులు శాంత రాజు, స్వర్ణ యానాది, పోస్ట్ కొండయ్య, వెంకటయ్య, పలుకూరి భాస్కర్, నోసిన రోశయ్య, జోన్నలగడ్డ ధర్మేంద్ర పాల్గొన్నారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై వృద్ధుడి మృతి


గుర్తుతెలియని మృతదేహం

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్ ఫాంపై గుర్తు తెలియని వృద్ధుడు (65) బుధవారం ఉదయం మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్లాట్‌ఫారం ఉత్తరం వైపున సుమారు 10 గంటల సమయంలో తెలుపు, గోల్డ్ స్పాట్ రంగు నిలువు చారల ఫుల్ హ్యాండ్స్ చొక్కా, నలుపు, తెలుపు గళ్ల లుంగీ, బ్లూ ఫుల్ డ్రాయర్ ధరించి ఉన్నాడు. ఇతని కుడికాలు మధ్య వేలు లేదు. మృతుడు అంధుడిగా తెలుస్తోంది. ఇతని వివరాలు తెలిసిన వారు సెల్ 9440627647 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని రైల్వే జీఆర్‌పీ ఎస్సై మధుసూదనరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించినట్లు ఆయన వివరించారు.

తప్పిపోయిన చిన్నారిని తల్లి చెంతకు చేర్చిన పోలీసులు


పాపను తల్లి చెంతకు చేర్చిన ఎస్సై మహేంద్ర

సింగరాయకొండ: ఐదు నెలల క్రితం తప్పిపోయిన 5 సంవత్సరాల చిన్నారిని తల్లిదండ్రుల చెంతకు పోలీసులు చేర్చిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పాతసింగరాయకొండ పంచాయతీ గుజ్జుల యలమందారెడ్డినగర్‌కు చెందిన గడిపూడి సురేష్, తిరుపతమ్మలు కాగితాలు ఏరుకుని అమ్ముకుంటూ జీవిస్తుంటారు. ఈ క్రమంలో వీరు ఐదు నెలల క్రితం బాపట్ల వెళ్లినప్పుడు రైల్వేస్టేషన్‌లో కూతురు లక్ష్మి (5) తప్పిపోయింది. దీంతో అక్కడి స్థానికులు పాపను ఒంగోలులోని చిన్నపిల్లల సంరక్షణ కేంద్రానికి పంపించారు. కేంద్రం నిర్వాహకులు పాప తల్లిదండ్రులను వెతికే క్రమంలో ఎస్సై బి.మహేంద్రను ఆశ్రయించారు. ఎస్సై మహేంద్ర చివరకు పాపను తల్లి తిరుపతమ్మ చెంతకు చేర్చారు. ఈ సందర్భంగా తల్లి తిరుపతమ్మ భావోద్వేగంతో తన కుమార్తెను తన చెంతకు చేర్చిన ఎస్సై మహేంద్రకు ధన్యవాదాలు తెలిపారు.


సామాజిక సేవలో స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ


బోరు బావికి శంకుస్థాపన చేస్తున్న బొడ్డు వెంకటేశ్వరరావు

టంగుటూరు: స్థానిక అంబేడ్కర్ నగర్లో స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవ సలహాదారులు, ఆదాయ పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ బొడ్డు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం బోరు బావిని ఏర్పాటు చేశారు. అంబేద్కర్ నగర్ ప్రజల నీటి ఇబ్బందిని గుర్తించిన స్థానిక 13వ వార్డు మెంబరు ఏల్చూరి వెంకట శేషమ్మ, 14వ వార్డు మెంబరు నత్తల హరిబాబులు సమస్యను వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల నీటి అవసరాన్ని గుర్తించి ఆయన బోరు బావి నిర్మించారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేద ప్రజల నీటి కష్టాలను తొలగించడానికి స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఎప్పుడూ ముందుంటుందని, మరికొన్ని బోరు బావులు అవసరమైన చోట నిర్మిస్తామని ప్రకటించారు.

చెరువులే ఆదాయ వనరులు


చెరువులో మట్టి తవ్వుతున్న జేసీబీ


మట్టి తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంతలు

- జేసీబీలతో మట్టి అక్రమ తవ్వకాలు
- ఆదివారం వచ్చిందంటే పండగే
- కూటమి నేతల ఇష్టారాజ్యం

కొండపి: మండలంలో మట్టి మాఫియా చెలరేగుతోంది. చెరువులు గుల్లవుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఇళ్ల స్థలాల్లో మెరక లేపేందుకు, ఇటుక తయారీకి, వెంచర్లకు చెరువుల్లో మట్టిని అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. భారీ యంత్రాలతో గోతులు తవ్వి మట్టి తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మట్టి మాఫియా కోట్లకు పడగలెత్తుతోంది. మండల కేంద్రం కొండపి చెరువు నుంచి చుట్టుపక్కల గ్రామాలకు అధికార బలం, కూటమి నాయకుల అండదండలతో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. కూటమి నేతలు అండదండలు మట్టి మాఫియాకు ఉండటంతో అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. పథకం ప్రకారం మట్టి మాఫియా ఆదివారమే అక్రమ తవ్వకాలు జరుపుతోంది. ఆదివారంతో పాటు ఇతర సెలవు దినాల్లో అధికారులు అందుబాటులో ఉండరని, ఆ సమయాన్ని ఆసరా చేసుకొని చెరువులో మట్టి తవ్వుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ మట్టి వ్యాపారులు తమ జేబులు నింపుకుంటున్నారు. గత రెండు ఆదివారాలు వెంచర్లకు ఇతర పనులకు ఉదయం 5.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు మట్టి తరలించారు. దాదాపు 20 ట్రాక్టర్లతో 250 నుంచి 300 ట్రిప్పుల వరకు తోలుకున్నారు. మట్టి తవ్వకాల ద్వారా మంచి ఆదాయం లభిస్తుండటంతో జేసీబీ యజమానులు కూడా ఉత్సాహంగా అక్రమాలకు సహకరిస్తున్నారు. కొండపి చెరువు నుంచి మట్టి తరలించే క్రమంలో డ్రైవర్లు అమిత వేగంతో ట్రాక్టర్లను నడుపుతున్నారని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఆదివారం జెండా చెట్టు ప్రాంతంలో మూడుసార్లు ప్రమాదాలు తప్పాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎవరు ఎక్కువ ట్రిప్పులు వేస్తే వారికి అన్ని డబ్బులు వస్తాయని ఆశతో డ్రైవర్లు అమిత వేగంతో ఎక్కువ ట్రిప్పులు తోలాలనే ఆశతో ట్రాక్టర్లను నడుపుతున్నారు. జరగకూడని ప్రమాదాలు సంభవిస్తే ఎవరు బాధ్యులుగా ఉంటారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టిని యథేచ్ఛగా రవాణా చేస్తుండటంతో చెరువులో భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. వర్షాలు పడితే గుంతల్లోకి నీరు చేరే అవకాశం ఉంటుంది. ప్రజలు గమనించకుంటే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుందని, ప్రాణాలు పోయే అవకాశం కూడా లేకపోలేదని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మట్టి మాఫియాపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


మట్టి తరలిస్తున్న ట్రాక్టర్

పనుల కల్పనలో అలసత్వం వహిస్తే చర్యలు

- డ్వామా పీడీ జోసఫ్‌కుమార్


ఉపాధి పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

సీఎస్‌పురం(పామూరు): కూలీలకు పనులు కల్పించడంలో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడి కూలీ ఎంత వస్తుంది, ఎన్నిగంటలు పనిచేస్తున్నారు, ప్రతి రోజు పనికల్పిస్తున్నారా, మస్టర్లు సక్రమంగా వస్తున్నాయా, ఇతర వసతులపై కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఆనికాలపల్లి పంచాయతీలో జరుగుతున్న ఊటకుంట పనులను పరిశీలించి పనులు చేయడంపై సూచనలు చేశారు. కూలీల హాజరు పెరిగేలా చూసి అత్యధికంగా వేతనం పొందేలా పనిచేయాలని సూచించారు. అనంతరం నిర్మాణంలోఉన్న పశువుల తొట్లను పరిశీలించి తొట్ల నిర్మాణంలో నాణ్యతా లోపాలు లేకుండా చూడాలని సిబ్బందిని హెచ్చరించారు. లక్ష్యాల మేరకు సిబ్బంది పనిచేయాలని, ఫారం పాండ్ పనులు, నీటినిల్వ పనులు చేయించడంలో ప్రభుత్వ ఆదేశాలను పాటించాలన్నారు. ఏపీడీ భాస్కర్‌రావు, ఏపీఓ శ్రీనివాసనాయక్ ఉన్నారు.

పామూరు: జాబ్‌కార్డులు ఉన్న వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో బుధవారం పామూరు, సీఎస్ పురం మండలాల ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో ఏపీడీ బాస్కర్‌రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధి కూలీల హాజరుశాతం పెంచాలని, కూలీ నగదు అధికంగా వచ్చేలా చూడాలన్నారు. మస్టర్లలో అక్రమాలు చోటుచేసుకుంటే ఉపేక్షించేది లేదన్నారు. మండలానికి 200 ఎకారాల్లో ఉద్యానవన పంటలు నిమ్మ, దానిమ్మ, బత్తాయి, మామిడి సాగుచేసుకునేందుకు ఆసక్తిఉన్న రైతులను గుర్తించాలని సూచించారు. సమావేశంలో పామూరు ఏపీఓ బి.మాల్యాద్రి, సీఎస్‌పురం ఏపీఓ శ్రీనివాసనాయక్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండల పరిధిలోని దొడ్డిచింతలలో ఉపాధి కూలీలు చేస్తున్న పూడికతీత పనులను ఏపీఓ వినయ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల మస్టర్లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇచ్చిన కొలతల ప్రకారం పనిచేయాలన్నారు. ఆ ప్రకారం పనిచేస్తే గిట్టుబాటు కూలి వస్తుందన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

ఉపాధి హామీ పనుల కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు అన్నారు. బుధవారం ఆయన ఉపాధి ఎఫ్ఏలు, టీఏలకు ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతి కూలికి పని లేదనకుండా కల్పించాలన్నారు. ప్రతి రోజు 23 గ్రామ పంచాయతీల పరిధిలో 5000 మంది కూలీలు పనిచేయాలన్నారు. పని వద్ద తప్పనిసరిగా కూలీలకు తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఏపిఓ వినయ్, టీఏలు దివ్యవాణి, రామ్‌తుల్లా, సుబ్బారెడ్డి, సీసీలు పాల్గొన్నారు.

కార్మికుల చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: అసంఘటిత కార్మికులు చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని న్యాయవాది, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సయ్యద్ షాహీద్ అన్నారు. మేడే వారోత్సవాలు పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి బి.రూపశ్రీ ఆధ్వర్యంలో స్థానిక పీవీఆర్ పార్క్ ఆవరణలో బుధవారం కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మిక హక్కులు, వేతన సవరణ చట్టం, బాధ్యతల గురించి వివరించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 15100 ఫోన్ చేసి న్యాయ సలహాలను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదుల గుమస్తాల సంఘం అధ్యక్షుడు సయ్యద్ యాసీన్, వివిధ సంస్థల ప్రతినిధులు,అధికారులు,పోలీసు సిబ్బంది సుబ్బారావు, మంద్రు రమేష్, బాలకృష్ణ, పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలకు అవార్డు

పొన్నలూరు: స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల పదో తరగతి విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి స్వామి చేతుల మీదుగా హెచ్ఎం బుధవారం అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాధవరావు మాట్లాడుతూ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పొన్నలూరు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు పాఠశాల విద్యార్థి దాసరి గణేష్ 541 మార్కులు సాధించి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో మొదటి స్థానం పొందినందున రాష్ట్ర ప్రభుత్వం జ్ఞాపికతో పాటు ప్రశంసపత్రం అందించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలకు ఆర్థిక సహకారం

జరుగుమల్లి (సింగరాయకొండ): కుట్టు శిక్షణ ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రమణమూర్తి అన్నారు. జరుగుమల్లి మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో బుధవారం కుట్టుశిక్షణను ఆయన ప్రారంభించారు. ఎంపీడీఓ రమణమూర్తి మాట్లాడుతూ కుట్టుశిక్షణలో బీసీ, కాపు, ఇడబ్ల్యూఎస్ వర్గాల మహిళలకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ లక్ష్యమని, బీసీ కార్పొరేషన్ సహకారంతో కుట్టుశిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఏపీఎం డి.జయరాజ్, మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం


టంగుటూరు: విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని విద్యుత్ శాఖ ఈఈ ఉషారాణి అన్నారు. టంగుటూరు రూరల్ సెక్షన్ పరిధిలో విద్యుత్ అధికారులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు 41 బృందాలుగా ఏర్పడి మొత్తం 2,320 గృహాలు, 44 వాణిజ్య సముదాయాల సర్వీసులును తనిఖీ చేశారు. వాటిలో 174 సర్వీసుల్లో అవకతవకలను గుర్తించారు. అడిషనల్ లోడ్ వాడుతున్న 174 సర్వీసులకు 4,85,400 జరిమానా విధించారు. తనిఖీల్లో ఈఈ ఉషారాణి, ఒంగోలు ఈఈ ఎం.హరిబాబు, డీఈఈలు తోట శ్రీకాంత్, పాండురంగారావు, డీపీ డీఈఈ శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు,ఒంగోలుపరిధిలోనిఏఈలు పాల్గొన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేత

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ నుంచి సస్పెండైన సామంతుల రవికుమార్‌రెడ్డిపై ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సస్పెన్షన్ ఎత్తి వేసినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ క్రమశిక్షణ సంఘం సిఫార్సు మేరకు అధినేత ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

కుట్టుమిషన్ల స్కీం పేరుతో స్కామ్

- కూటమి నేతలు పంచుకు తినేందుకు కుట్టుశిక్షణ
- సూపర్ సిక్స్ హామీలను తొంగలో తొక్కిన కూటమి సర్కార్


మాట్లాడుతున్న తమ్మినేని సుజాత, పక్కన పులి శాంతి, మహిళా నేతలు

కనిగిరిరూరల్: మహిళలకు కుట్టు మిషన్లు, ఉచిత శిక్షణ పేరుతో కూటమి నేతలు భారీ స్కామ్‌కు పాల్పడ్డారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు, వైస్ చైర్మన్ పులి శాంతి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అంగన్‌వాడీ విభాగం జనరల్ సెక్రటరీ, కౌన్సిలర్ తమ్మినేని సుజాత అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కుట్టు మిషన్ కొనుగోలులో రూ.4,300, ఒక వ్యక్తికి శిక్షణ నిమిత్తం రూ.3వేలు వెరసీ మొత్తం రూ 7,300 ఖర్చవుతుందన్నారు. కానీ కూటమి నేతలు ఒక్కో మహిళ పేరుతో రూ.23వేలు కేటాయించి నిలువు దోపిడీకి పాల్పడ్డారని ఘాటుగా విమర్శించారు. 50 రోజులు కుట్టు శిక్షణలో రూ.167 కోట్ల భారీ స్కాంకు కుట్ర చేశారని తీవ్రంగా విమర్శించారు. కూటమి నేతలు పంచుకుని తినేందుకు కుట్టు శిక్షణ అని ఘాటుగా విమర్శించారు. కార్పొరేషన్ రుణాల పేరితో భారి దోపిడికి రంగం సిద్ధం చేశారన్నారు. కుట్టు మిషన్ల కుంభ కోణంలో పాత్ర పోషించి అధికారులు, ఉద్యోగాలు ఊడటం ఖాయమన్నారు. గత ప్రభుత్వం ప్రతి పథకం నేరుగా మహిళల, లబ్ధిదారుల ఖాతాల్లోకే నగదు జమ అయ్యేయని వివరించారు. నేటి కూటమి ప్రభుత్వం పాలనలో అందుకు విరుద్ధంగా కూటమి నేతల దోపిడీ జరుగుతుందని ఘాటుగా విమర్శించారు.

సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయి?

కూటమి ప్రభుత్వ నేతలు అధికారం కోసం అడ్డమైన హామీలతో అధికారంలోకి వచ్చి వాటిని పూర్తిగా విస్మరించారన్నారు. అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటినా ఒక్క హామీని అమలు చేయలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ అంగన్‌వాడీ విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు ఎం నాగమణి, పట్టణ మహిళా నాయకులు ఎస్‌కే నాగూర్‌బీ, ఎం భారతీ, ఎస్‌కే షకీలా, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ మాత జయంతి


108 కలశాలలో ఊరేగింపుగా వస్తున్న ఆర్యవైశ్య మహిళలు


ముస్తాబైన వాసవీ అమ్మవారు

సింగరాయకొండ: మండలంలో బుధవారం పలు ఆలయాల్లో వాసవీమాత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ చెట్టుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో వాసవీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీ షిర్డీ సాయిమందిర్ సమీపంలో వాసవీ అమ్మవారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి పూజలు, హోమాలు నిర్వహించారు. ఊళ్లపాలెంలోని శ్రీ వాసవీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి హోమాలు, అభిషేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పామూరు: వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి జన్మదిన వేడుకలు స్థానిక ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్థానిక రమాసమేత వీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం వద్ద నుంచి కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం వరకు ఆర్యవైశ్య మహిళలు 108 కలశాలతో కలశోత్సవం నిర్వహించారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

- కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్


వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

పొన్నలూరు: మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే చర్యలు తప్పవని కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ హెచ్చరించారు. పొన్నలూరులో ఓవీ రోడ్డుపై బుధవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బైక్‌లు నడుపుతున్న మైనర్లకు, వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ మైనర్లు బైకులు నడుపుతూ పట్టుబడితే వారితో పాటు తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. చిన్న వయసులో వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు. లైసెన్స్, హెల్మెట్ లేకున్నా, మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆటో డ్రైవర్లు పరిమిత సంఖ్యలో నిబంధనలు ప్రకారం ప్రయాణికులను ఎక్కించుకోవాలని, ట్రాక్టర్ డ్రైవర్లు సైడ్ డోర్లు తీసి కూలీలను ఎక్కించరాదన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించకపోతే కేసులు తప్పవన్నారు. ఆయన వెంట స్థానిక ఎస్సై అనూక్ ఉన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న సీఐ భీమానాయక్

పామూరు: పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించడంపై ఎస్సైలు ప్రత్యేక దృష్టి సారించాలని సీఐ ఎం భీమానాయక్ అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో బుధవారం సర్కిల్ పరిధిలోని పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల పోలీస్‌స్టేషన్‌లకు సంబంధించిన ఎస్సైలతో నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా స్టేషన్‌లలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, విచారణ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. మద్యం తాగి ఆకతాయి చేష్టలకు పాల్పడేవారి పట్ల కఠినంగా ఉండాలన్నారు. ఎవరైనా ముఖ్యంగా మహిళలను ఇబ్బందులు పెడితే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. వాహనాల్లో అదనపులోడ్‌లేకుండా, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఇందుకోసం వాహనదారులతో సమావేశాలు నిర్వహించి అవగాహన చేయాలని సూచించారు. ఎవరైనా మైనర్లకు వాహనాలు ఇస్తే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇచ్చేలా ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఎస్సైలు పామూరు టి.కిషోర్‌బాబు, సీఎస్‌పురం ఆర్.సుమన్, వెలిగండ్ల కృష్ణపావని పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మంగారి ఆరాధనా మహోత్సవం


చౌటపాలెంలో అలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి


వీరబ్రహ్మేంద్ర ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

పామూరు: మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనా మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నెల్లూరు రోడ్డు విరాట్‌నగర్‌లోని బ్రహ్మంగారి ఆలయంతో పాటు, స్థానిక వైఎస్సార్ సెంటర్ వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా స్వామివార్ల ఉత్సవమూర్తులకు అభిషేకం, కుంకుమపూజ చేశారు. . ఆలయ గౌరవాధ్యక్షుడు వినుకొండ రామాచారి, చైర్మన్ యం.దొరసానయ్యాచారి, విశ్వబ్రాహ్మణసంఘం మండల అధ్యక్షుడు నొస్సం నాగేంద్రాచారి, పెరమన విజయకుమారాచారి, నొస్సం సుఖేష్, పి.బాలబ్రహ్మాచారి, శానంపూడి చంద్రశేఖర్, పోలిచర్ల బాలబ్రహ్మాచారి, వి.బాలబ్రహ్మాచారి, యం.ప్రసాద్, ఎస్.శ్రీశైలం ఆచారి, భక్తులు పాల్గొన్నారు.

పొన్నలూరు: మండల కేంద్రం పొన్నలూరు, విప్పగుంట, చౌటపాలెం గ్రామాల్లో బుధవారం భక్తులు భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాలను విద్యుత్ కాంతులతో, స్వామివారి దంపతుల విగ్రహాలను పూలతో అందంగా అలంకరించారు. సాయంత్రం స్వామివారిని మేళతాళాలతో గ్రామాల్లోని పురవీధుల్లో ఊరేగించారు.

సింగరాయకొండ: మండలంలోని శానంపూడి పంచాయతీ శ్రీ వీరబ్రహేంద్రస్వామి దేవస్థానంలో బుధవారం ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆ తర్వాత గ్రామోత్సవం నిర్వహించారు. అన్నదానం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మర్రిపూడి: గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం స్థానిక బ్రహ్మంగారి ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సర వైశాఖ శుద్ధ దశమిని పురస్కరించకుని బ్రహ్మంగారి ఆలయంలో పూజారి దారుకుమల్లి నర్సమ్మ స్వాముల వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు స్వాముల వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు


భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి ప్రకాష్‌రావు

పీసీపల్లి: భూసార పరీక్షలు చేయించుకుని పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి కె.ప్రకాష్‌రావు అన్నారు. మండల పరిధిలోని పీసీపల్లిలో బుధవారం రైతులతో భూసార పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ గ్రామ సహాయకుడు మనోహర్, రైతులు పాల్గొన్నారు

కనిగిరిరూరల్: ప్రతి మూడేళ్లకు ఒకసారైనా రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏడీఏ ఈ వెంకటరమణ అన్నారు. మండలంలోని పోలవరంలో మట్టి నమూనాలు, భూ సార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఏఓ జోత్స్నాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడుతూ భూసార పరీక్షలు, మట్టినమూనాల పరిశీలన చేయించడం రైతుకు ఎంతో మంచిదన్నారు. ఏఓ జోత్స్నాదేవి మాట్లాడుతూ ఈ ఏడాది 1280 శాంపిళ్లను ఇచ్చి ఉన్నట్లు చెప్పారు. వ్యవసాయ సహాయకురాలు ఎస్‌కే షబానా, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల వివరాలు తెలపాలి


వేలం నిర్వహిస్తున్న నిర్వాహణాధికారి సునీల్‌కుమార్

కొండపి: శీతల గిడ్డంగుల్లో ఉన్న పొగాకు బేళ్ల వివరాలు తెలియపరచాలని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ సూచించారు. బుధవారం 4వ రౌండ్ వేలం ప్రారంభం సందర్భంగా రైతులకు పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ దగ్గర ఉన్న బేళ్ల వివరాలు బోర్డుకు తెలియపరచాలని, అనధికారికంగా పొగాకును అమ్మ రాదని సూచించారు. శుక్రవారం నిర్వహించిన వేలంలో క్లస్టర్ పరిధిలోని జువ్విగుంట, అయ్యావారిపాలెం, జాళ్లపాలెం, పీరాపురం, తంగెళ్ల గ్రామాలకు చెందిన రైతులు 1268 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 839 బేళ్లు కొనుగోలు చేశారు. వ్యాపారుల వివిధ కారణాలతో 429 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.210, సరాసరి ధర కేజీ రూ.252.75గా నమోదైంది. వేలంలో 17 కంపెనీలకు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్లు 150 కేజీలకు మించరాదు

టంగుటూరు: పొగాకు బేళ్లు 150 కేజీలకు మించరాదని, మించితే తిరస్కరణకు గురవుతాయని, వేలం కేంద్రం వెలుపల కాటాలు ఏర్పాటు చేశామని, రైతులు గమనించాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక వేలం కేంద్రానికి కారుమంచి గ్రామానికి చెందిన రైతులు బుధవారం 667 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 576 కొనుగోలు చేశారు. 91 పొగాకు బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. గరిష్ఠ ధర రూ.280 పలకగా కనిష్ఠ ధర రూ.205 పలికింది. సరాసరి రూ.250.39 ధర పలికింది. వేలంలో మొత్తం 20 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

జెడ్పీహెచ్ఎస్‌లో డిజిటల్ టీవీ ధ్వంసం


దుండగులు పగులగొట్టిన డిజిటల్ టీవీ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని శీలంవారి పల్లె కేవీఎస్ఎల్ జెడ్పీహెచ్ఎస్ ప్లస్ పాఠశాలలో గుర్తు తెలియని దుండగులు బుధవారం మధ్యాహ్నం రూ.లక్ష విలువైన డిజిటల్ టీవీని పగులగొట్టారు. దీనిపై పాఠశాల హెచ్ఎం ఎస్.తిరుపతయ్య, ఎస్‌యంసీ చైర్మన్ మూరం మస్తానయ్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. అదేవిధగా గతనెల 23వ తేదీన పాఠశాల ఆవరణలోని సిమెంట్ బెంచీలు ధ్వంసం చేశారని, దీనిపై కూడా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పాఠశాలలో మరో 4 నాలుగు డిజిట్ టీవీలు, రూ.లక్షల విలువైన ఫర్నీచర్ ఉన్నాయని వీటికి భద్రత కల్పించి టీవీని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.